12 రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

హైదరాబాద్, జూన్ 8(నమస్తే తెలంగాణ): వచ్చే రెండు రోజుల్లో పశ్చిమ బెంగాల్, సిక్కిం, అస్సాం, మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, గోవా, మహారాష్ట్ర, కర్నాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు కేంద్ర వాతావరణ శాఖ హెచ్చరించింది. మధ్యప్రదేశ్, జార్ఖండ్, బీహార్, ఒడిశా, పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించినట్లు ఐఎండీ వివరించింది.

భద్రాద్రి జిల్లాలో వర్షం

కొత్తగూడెం టౌన్/పాల్వంచ/చుంచుపల్లి, జూన్ 8 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంతోపాటు చుంచుపల్లి, పాల్వంచ పట్టణంలో శనివారం ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కావడంతో వాహనదారులు, పాదచారులు, వ్యాపారులు ఇబ్బందిపడ్డారు.

యార రాజిరెడ్డి(ఫైల్)

కరెంట్ షాక్‌తో రైతు మృతి

చిట్యాల (మొగుళ్లపల్లి), జూన్ 8 : విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల ఇస్సిపేటలో శనివారం చోటుచేసుకున్నది. ఇస్సిపేటకు చెందిన యార రాజిరెడ్డి (58) వడ్లు బియ్యం పట్టించేందుకు కిరాయికి టాటా ఏస్ వాహనం వచ్చింది. ఆ వాహనం ఇంటి ఆవరణలోకి వస్తుండగా, కరెంటు సర్వీస్ వైరు తగులుతుందని భావించి చేతితో పైకి ఎత్తాడు. రాజిరెడ్డి ఆ వైరును పట్టుకోవడంతో ఒక్కసారిగా షార్ట్‌సర్క్యూట్‌కు గురై ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు.

అక్కడ 'భూంభూం'.. ఇక్కడ 'బీర్యానీ'

- తెలంగాణలో కొత్త బీర్ల ఎంట్రీ
- చక్రం తిప్పుతున్న మాజీ ఐఏఎస్
- ప్రభుత్వానికి మరింత చేరువ
- రాష్ట్రంలో ప్రముఖ బ్రాండ్ల కొరత

తెలంగాణలో విక్రయానికి రానున్నట్టు ప్రచారమవుతున్న కొత్త రకం బీర్లు ఇవే

హైదరాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ): తెలుగు రాష్ట్రాల్లో ఎంట్రీ ఇస్తున్న కొత్త బ్రాండ్ బీర్లు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఒక రాష్ట్రంలో 'భూం భూం' పేరుతో ఉన్న బీరును తెలంగాణలో 'బీర్యానీ' పేరుతో ప్రవేశపెడుతున్నట్టు సామాజిక మాధ్యమాల్లో వాటిలో ఫొటోలు దర్శనమిస్తున్నాయి. మద్యం ప్రియులకు అలవాటైన పాత బ్రాండ్ల కొరత రాష్ట్రంలో ఇప్పటికీ కొనసాగుతున్నది. ఉద్దేశపూర్వకంగానే మద్యం కృత్రిమ కొరత సృష్టించారని ఓవైపు ఆరోపణలు వస్తుండగా.. ఈ కొరత కారణంగానే కొత్త కంపెనీలకు అనుమతిచ్చామని ప్రభుత్వం పేర్కొంటున్నది. ఇటీవల ఐదు కొత్త బీర్ల కంపెనీలకు రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన అనుమతులు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రక్రియ వెనుక ఓ మాజీ ఐఏఎస్ అధికారి కీలకపాత్ర పోషిస్తున్నట్టు మద్యం వ్యాపారులు చర్చించుకుంటున్నారు.

కొత్త బ్రాండ్ల వెనుక మాజీ ఐఏఎస్?

బీఆర్ఎస్ హయాంలో ఓ విభాగానికి సెక్రటరీగా ఉంటూ రిటైర్ అయిన ఓ ఐఏఎస్ అధికారి.. ఇటీవల కొత్త ప్రభుత్వానికి మరింత దగ్గరయ్యారని.. ఆయనే ప్రభుత్వ పెద్దల పంచన చేరి, అనధికారిక మద్యం పాలసీలో చక్రం తిప్పుతున్నాడని విశ్వసనీయ సమాచారం. ఆయన ఓ డిస్టిలరీ కంపెనీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ.. కొన్ని మద్యం కంపెనీలకు ముడిసరుకు ఇచ్చే వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్టు చెప్తున్నారు. దీంతో ప్రభుత్వ పెద్దలు కూడా కిమ్మనకుండా ఆయన చెప్పింది ఫాలో అవుతున్నారని తెలిసింది. ఈ నేపథ్యంలోనే కొత్త బ్రాండ్లను పథకం ప్రకారం తెలంగాణకు రప్పించడం వెనుక ఆయన హస్తం ఉన్నదని సమాచారం. తన పలుకుబడిని ఉపయోగించి మరికొన్ని కొత్త కంపెనీలను కూడా తెలంగాణకు రప్పించే ప్రయత్నం చేస్తున్నారని వ్యాపారులు చెప్తున్నారు.

కొత్త బ్రాండ్లపై సంశయం

తెలంగాణలో వచ్చే కొత్త బ్రాండ్ల మద్యం నాణ్యత, అమ్మకాలపై మద్యం వ్యాపారుల్లో సంశయం నెలకొన్నది. ఇటీవల బేవరేజెస్ కార్పొరేషన్ కొత్తగా ఐదు మద్యం కంపెనీల నుంచి 27 రకాల కొత్త ఉత్పత్తులకు అనుమతులు ఇచ్చింది. ఈ కొత్త ఉత్పత్తులు మద్యం ప్రియులకు నచ్చుతాయా లేదా, ఒకవేళ అవి కల్తీవి అన్న అనుమానంతో కొనుగోళ్లు జరగకపోతే తమ పరిస్థితి ఏమిటని వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రవేశిస్తున్న కొన్ని కంపెనీల నుంచి ఇదివరకే కల్తీ మద్యం తయారైనట్టు ఆరోపణలు వస్తున్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన 'సోం డిస్టిలరీస్' సంస్థపై అనేక వివాదాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ కోసం ఈ సంస్థ ఎలక్టోరల్ బాండ్లు కొన్నట్టు మధ్యప్రదేశ్‌లోని పలు మీడియా సంస్థలు బ్యాంకు ఆధారాలను కూడా బయటపెట్టాయి. బీజేపీ, కాంగ్రెస్‌కు ఎన్నికల ఫండింగ్‌లోనూ ఈ సంస్థ కీలకంగా వ్యవహరించినట్టు సమాచారం. దీంతో ఇటువంటి కంపెనీల నాణ్యమైన మద్యాన్ని ఆశించగలమా అని మద్యం ప్రియులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. కొత్త బ్రాండ్ల పేరుతో కల్తీ మద్యం తీసుకురావొద్దని వారు వేడుకుంటున్నారు. అలాగే తమకు అలవాటైన ప్రముఖ కంపెనీలకు చెందిన మద్యాన్ని, బీర్లను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్రంలో మళ్లీ బావిబాట

- గ్రామాల్లో బావుల తవ్వకం
- ఈ ఏడాది నీరందక ఎండిన పంటలు
- నీటి గోస భయంతో తవ్వకాలు
- వనపర్తి జిల్లాలో భారీగా కొత్త బావులు
- వెయ్యి పాత బావుల్లో పూడికతీతలు

వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం సంపత్‌రావ్‌పల్లి వద్ద ఓరైతు తవ్విస్తున్న కొత్త బావి

వనపర్తి, జూన్ 8 (నమస్తే తెలంగాణ) : రైతన్నలకు మళ్లీ పాత రోజులు వచ్చాయి. వ్యవసాయాన్ని నిలుపుకోవడానికి బావుల బాట పట్టారు. దాదాపు రెండు దశాబ్దాలుగా కనిపించని ఈ ఒరవడి ఇప్పుడు గ్రామాల్లో విరివిగా కనిపిస్తున్నది. ఇంతకాలానికి మళ్లీ రైతులు వ్యవసాయ బావుల తవ్వకాలు చేపట్టడానికి కారణం.. ఈ ఏడాది తీవ్రంగా నీటి గోస తలెత్తడమే. వనపర్తి జిల్లాలో రైతన్నలు బావులు తవ్వుకుంటున్నారు. ఈ ఏడాది తీవ్ర నీటిఎద్దడిని చూసి భయంతో మళ్లీ బావుల తవ్వకానికి శ్రీకారం చుట్టారు. కేసీఆర్ ప్రభుత్వంలో వరుసగా కాల్వలో నీళ్లను చూసిన రైతులకు ఈసారి కాల్వల్లో నీళ్లు అంతంత మాత్రమే వచ్చాయి. పుష్కలంగా రెండు పంటలను పండించిన పరిస్థితి నుంచి మళ్లీ ఎన్కటి రోజులను ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు. నీటి గోస నుంచి బయట పడేందుకు జిల్లాలో పాత బావుల్లో పూడికతీత పనులకు రైతులు మొగ్గు చూపారు. జిల్లా వ్యాప్తంగా 14 మండలాల్లో దాదాపు వెయ్యి పాత బావుల్లో పూడిక పనులను చేపట్టినట్టు సమాచారం.

కొత్తగా 200 బావులు

వనపర్తి జిల్లాలోని వివిధ గ్రామాల్లో ఈ మూడు, నాలుగు నెలల కాలంలోనే దాదాపు 200కుపైగా కొత్త బావులను రైతులు తవ్వించుకున్నారు. జేసీబీ, హిటాచీల ద్వారానే పనులు చేపట్టారు. గతంలో మనుషుల ద్వారానే బావులను తవ్వించేవారు. కానీ నేడు యంత్రాల సహాయంతోనే పనులు వేగంగా చేస్తున్నారు. జిల్లాలోని అనేక గ్రామాల్లో బావుల తవ్వకం చేపట్టగా.. వీపనగండ్ల మండలం సంపత్‌రావ్‌పల్లి లోనే దాదాపు 15 బావులను కొత్తగా తీయించారు. సంగినేనిపల్లి, అయ్యవారిపల్లి తదితర గ్రామాల్లో బావులను తవ్వుకున్నారు. ఈ బావుల ద్వారాపంట చేతికి అందుతుందన్న భరోసాతో రైతులు ఈ తవ్వకాలు చేపడుతున్నారు. ఒక్కో బావికి లక్ష వరకు రైతులు ఖర్చు చేస్తున్నారు. సంపత్‌రావ్‌పల్లిలో బండారు నాగన్న, ఓరే మహేశ్, గోపాల వెంకటస్వామి, మిద్దె కురుమయ్య, ఓరే మల్లయ్య, ఓరే వెంకటేశ్, మేకల లక్ష్మయ్య, మేకల ఉశాన్ తదితరులు బావులను తవ్వించారు.

పంట ఎండొద్దని..

ఈ సారి నీటి ఎద్దడి చూసి గ్రామంలో చాలా మంది కొత్తగా బావులు తవ్వుకున్నారు. పది మందికి పైగానే రైతులు జేసీబీలతో తోడించారు. కేసీఆర్ ప్రభుత్వంలో నీటి ఇబ్బంది తలెత్తలేదు. కానీ నేడు బోరు ఉన్నా నమ్మకం లేదు. బావి ఉంటే, కనీసం రెండు లేదా మూడు తడులకైనా నీళ్లు అందుతాయన్న నమ్మకం. కొత్త బావికి దాదాపు రూ.లక్ష ఖర్చు అయింది.

– నాగన్న, రైతు, సంపత్‌రావ్‌పల్లి, వీపనగండ్ల మండలం, వనపర్తి జిల్లా

ఈ ఏడే కొత్త బావులు తవ్వాం

ఈ ఏడాది మాత్రమే కొత్త బావుల పనులు వచ్చాయి. చాలా మంది రైతులు నీటి ఎద్దడిని తట్టుకోలేక మళ్లీ కొత్తగా బావులను తవ్వించారు. జిల్లాలో 4 జేసీబీలు ఇలా కొత్త బావులను తవ్వే పనులు చేశారు. మేమే ఈ నాలుగైదు నెలల్లో దాదాపు 50 నుండి 60 బావుల వరకు కొత్తగా తవ్వాం. ఈ 25 ఏండ్లలో కొత్తగా బావులు తవ్విన సందర్భాలు చాలా తక్కువ.

– వెంకటేశ్వర్‌రెడ్డి, జేసీబీ యజమాని, కల్వరాల, వనపర్తి జిల్లా

కరీంనగర్ జిల్లా ఆసిఫ్‌నగర్‌లో క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న మెడికల్ కౌన్సిల్ సభ్యులు

అనుమతిలేని క్లినిక్‌లపై దాడులు

కరీంనగర్, జూన్ 8 (నమస్తే తెలంగాణ): కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని పలు అనుమతి లేని క్లినిక్‌లపై శనివారం తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు దాడులు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం నీలోజిపల్లిలో కరుణ క్లినిక్ పేరు తో జక్కని లక్ష్మీనారాయణ అనే వ్యక్తి అనుమతి లేకుండా, నిబంధనలు అతిక్రమించి అల్లోపతి వైద్యం చేస్తున్నట్టు గుర్తించారు. అల్లోపతి ఇంజక్షన్లు, యాంటీబయాటిక్, స్టెరాయిడ్ వంటి వాటిని రోగులకు ఉపయోగిస్తున్నట్టు తేలింది. కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లో అనుమతులు లేకుండా రీసా, వందర, సిటీ, శ్రీవిషిక పేరుతో నిర్వహిస్తున్న క్లినిక్‌లను గుర్తించారు. చింతకుంటలో ఆనంద్ క్లినిక్‌కూ అనుమతులు లేనట్టు తెలిపారు.

అడుగంటిన శ్రీరాంసాగర్

- డెడ్‌స్టోరేజ్‌కు చేరిన నీటిమట్టం
- ప్రస్తుతం ఉన్నది 6.39 టీఎంసీలే..
- పూడిక మేటలు.. తగ్గిన స్టోరేజీ కెపాసిటీ
- ఎస్సారెస్పీ కింద 18 లక్షల ఎకరాల ఆయకట్టు



ఎడారిలా మారిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

ముప్కాల్ (మెండోరా), జూన్ 8: తెలంగాణలోని వేల కుటుంబాలకు ఆధారం.. 18 లక్షలకు పైగా ఎకరాలకు ఆయువుపట్టు అయిన శ్రీరాంసాగర్ ఎండిపోయింది. కేవలం 1056.30 అడుగుల (6.39 టీఎంసీలు) నీటిమట్టంతో ఎస్సారెస్పీ మైదానాన్ని తలపిస్తున్నది. ప్రాజెక్టులో పూడిక పేరుకుపోయి నీటి నిల్వ సామర్థ్యం బాగా తగ్గిపోయిందన్న నివేదిక ఆయకట్టు రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తున్నది. మొన్నటిదాకా ఎస్సారెస్పీ నిల్వ సామర్థ్యం 90 టీఎంసీలు కాగా.. పూడిక కారణంగా ఇప్పుడది 80 టీఎంసీలకు పడిపోయినట్టు తెలుస్తున్నది.

ఎడారిని తలపిస్తున్న ఎస్సారెస్పీ

1960వ దశకంలో గోదావరి నదిపై బహుళార్థ సాధక ప్రాజెక్టుగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టును నిర్మించారు. తాగు, సాగునీటి అవసరాలను తీర్చడంతోపాటు విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంగా నిర్మితమైన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం ఎడారిని తలపిస్తున్నది. గత డిసెంబర్ వరకూ నిండుకుండగా తొణికిసలాడిన ఈ జలాశయంలో ప్రస్తుతం 1056.30 అడుగులు (6.39 టీఎంసీలు) మాత్రమే నీరున్నది. ఇందులోంచి తాగునీటి అవసరాలకు 231 క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 10, ఆవిరి రూపంలో 245 క్యూసెక్కులతో కలిపి నిత్యం 486 క్యూసెక్కుల నీరు తగ్గిపోతున్నది. నిరుడు ఇదే సమయానికి 14.77 టీఎంసీలకు పైగా నీరు నిల్వ ఉన్నది. ప్రణాళికారహితంగా నీటిని వదిలేయడం వల్లే ఎస్ఆర్ఎస్పీలో నీటి మట్టం తగ్గిపోతున్నదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పూడికతో తగ్గిన సామర్థ్యం..

నూట పన్నెండు టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ఎస్సారెస్పీలోకి దశాబ్దాల కాలంలో పెద్ద ఎత్తున పూడిక చేరింది. దీంతో ప్రాజెక్టు సామర్థ్యం ప్రస్తుతం 90 టీఎంసీలని చెప్తున్నప్పటికీ, అంతకంటే తక్కువగానే ఉంటుందని అధికారులు అంటున్నారు. శ్రీరాంసాగర్‌లో స్టోరేజీ కెపాసిటీ ఆధారంగా 18 లక్షల ఆయకట్టును స్థిరీకరించారు. కానీ ఇప్పుడు దాని సామర్థ్యం 80 టీఎంసీలకు పడిపోవడంతో చివరి ఆయకట్టు భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. కాలం కాకపోతే గోదావరికి వరదలు రావు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండదు. గతంలో ఇటువంటి ఉదంతాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితి భవిష్యత్తులో పునరావృతం కాకుండా కేసీఆర్ ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టింది. పునరుజ్జీవ పథకంలో భాగంగా రివర్స్ పంపింగ్ ద్వారా గోదావరిని శ్రీరాంసాగర్‌కు తరలించారు. నిరుడు ఐదు పంపుల ద్వారా 2.54 టీఎంసీలను శ్రీరాంసాగర్‌కు తరలించారు. తద్వారా వేలాది కుటుంబాలకు తాగునీరు, 18 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేలా భరోసా కల్పించారు.

టైగర్ రిజర్వ్ నుంచి 415 కుటుంబాల తరలింపు

- అమ్రాబాద్‌ఫారెస్ట్ పరిరక్షణకు చర్యలు
- అటవీశాఖ ప్రణాళికలు
- బాచారానికి తరలించే అవకాశం

హైదరాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ) : నిరుడు కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి 94 కుటుంబాలను తరలించిన రాష్ట్ర అటవీశాఖ, ఇప్పుడు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి దాదాపు 415 కుటుంబాలను తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నది. సార్లపల్లి, కుడిచింతలబైలు, కొల్లంపేట, తాటిగిండాల గ్రామాలకు చెందిన కుటుంబాల తరలింపుకోసం అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ కుటుంబాలను నాగర్‌కర్నూల్–కొల్లాపూర్‌లోని బాచారం తదితర ప్రాంతాలకు తరలించే అవకాశముంది. ఈ గ్రామాల తరలింపు ద్వారా దాదాపు 1192 హెక్టార్ల అటవీ భూములకు భద్రత లభిస్తుందని చెబుతున్నారు.

కలెక్టర్ నేతృత్వంలోని జిల్లాస్థాయి కమిటీకి అటవీశాఖ అధికారులు ఇప్పటికే ప్రణాళికలు సమర్పించారు. అక్కడి నుంచి రాష్ట్ర కమిటీకి, తుది ఆమోదం కోసం నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్టీసీఏ)కి పంపుతామని వెల్లడించారు. కవ్వాల్ ఫారెస్ట్‌లోని రాంపూర్, మైసారం నుంచి 94 కుటుంబాలను మడిపడగకు తరలించినట్టు వివరించారు. నిర్వాసితులకు రూ.15లక్షల నగదు పరిహారం లేదా భూమిని అందించాలని ప్రతిపాదిస్తున్నారు. ప్రతి కుటుంబాన్ని యూనిట్‌గా పరిగణించి నగదు లేదా భూమిని ఎంపిక చేసుకునే అవకాశం లబ్ధిదారుకే ఇవ్వనున్నారు. ఇప్పటికే గుర్తించిన భూమిని అభివృద్ధి చేసి రోడ్డు మార్గం, నీరు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతులు కల్పించాలని వివిధ శాఖలను ఆదేశించారు. ఎన్టీసీఏ ఆమోదం తర్వాత నెలలో పునరావాస కసరత్తు ప్రారంభమవుతుందని తెలిపారు. మానవ–వన్యప్రాణుల సంఘర్షణ, జీవవైవిధ్య అభివృద్ధి, స్థానికుల సంక్షేమం, ముఖ్యంగా చెంచుల సంక్షేమం కోసం నాలుగు గ్రామాల కుటుంబాలను ఫారెస్ట్ నుంచి బాచారం తరలించాలనే ఆలోచనలో ఉన్నట్టు ఓ అధికారి తెలిపారు. తొలిదశలో నాలుగు గ్రామాలవారిని, రెండో దశలో వట్వార్‌పల్లి నుంచి కొందరిని తరలిస్తామని చెప్పారు.

జింకను చంపిన వీధికుక్కలు

గురువారం ఉదయం అనంతగిరి పుష్కరిణి సమీపంలో తిరుగాడిన ఓ జింకను వీధి కుక్కలు వేటాడి పీక్కుతిన్నాయి. దీన్ని చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పిల్లలు కూడా బయట ఆడుకుంటూ గడుపుతుంటారని కుక్కలు పిల్లలపై దాడిచేస్తే ఎలా అని ఆందోళన చెందుతున్నారు. అనంతగిరిలో వీధికుక్కలపై అటవీశాఖ అధికారులు దృష్టిపెట్టాలని కోరుతున్నారు. కుక్కల బారి నుంచి జింకలు, ఇతర అటవీ జంతువుల రక్షణకు చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

దేవాదుల ఇన్‌టేక్‌వెల్‌లో

పూడికతీత

తుపాకులగూడెం బరాజ్ గేట్ల ఎత్తివేత

ఏటూరునాగారం, జూన్ 8: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం గోదావరిపై నిర్మించిన దేవాదుల ఎత్తిపోతల పథకం(ఇన్‌టేక్‌వెల్) వద్ద పూడికతీత పనులు చేపట్టేందుకు బరాజ్‌లో ఉన్న నీటిని వదిలేస్తున్నారు. దేవాదుల ఇన్‌టేక్‌వెల్ ద్వారా నిత్యం నీటిని పంపింగ్ చేసేందుకు అవసరమైన నీటి నిల్వ కోసం తుపాకులగూడెం బరాజ్‌ను గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. బరాజ్ నుంచి దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వరకు నీటినిల్వ ఉండడంతో ఇంతకాలం భీంఘనపూర్‌లోని రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేశారు. ప్రస్తుతం వానకాలం సమీపిస్తుండడంతో దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద పేరుకుపోయిన ఇసుక, ఒండ్రుమట్టిని తొలగించాల్సిన అవసరం ఉంది. ఇందుకు తుపాకులగూడెం బరాజ్ వద్ద గేట్లను ఎత్తి ఒక టీఎంసీ నీటిని దిగువకు వదిలారు. ఎగువ నుంచి వచ్చే గోదావరి వరదనేరుగా తుపాకులగూడెం బరాజ్ నుంచి కిందికి ప్రవహిస్తున్నది. ఇన్‌టేక్‌వెల్ నుంచి పంపింగ్ కూడా నిలిపివేశారు. దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద పూడికతీతకు రూ.30 లక్షలను కేటాయించారు. పనులకు టెండర్లు నిర్వహించారు. ఇన్‌టేక్‌వెల్ వద్ద నీరు పూర్తిగా వెళ్లిపోతేనే సిల్ట్ తీసే అవకాశం ఉంది. ప్రస్తుతం తుపాకులగూడెం బరాజ్ గేట్లను సిల్ట్ తీసే వరకు ఎత్తి ఉంటాయని నీటి పారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. పూడికతీత పనులు పొందిన కాంట్రాక్టర్ మిషనరీతో దేవాదుల వద్దకు చేరుకుని వారం రోజుల్లో పనులు ప్రారంభించే అవకాశాలు ఉన్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. సుమారు 10 రోజుల సమయం పట్టొచ్చని చెబుతున్నారు. వానకాలం వరద వచ్చేలోపు సిల్ట్ పనులు పూర్తి చేసేందుకు నీటి పారుదలశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అంతేకాకుండా ఇన్‌టేక్‌వెల్ వద్ద ఉన్న గేట్లకు కూడా మరమ్మతు చేయనున్నారు. తుపాకులగూడెం బరాజ్‌ను నిర్మించిన తర్వాత దేవాదుల ఇన్‌టేక్‌వెల్‌లోని పంపుల ద్వారా నీటిని భీంఘనపూర్ రిజర్వాయర్‌కు చేరవేస్తున్నారు. అక్కడ నుంచి ఇతర రిజర్వాయర్లకు నీటి పంపింగ్ జరుగుతున్నట్టు అధికారులు వెల్లడిస్తున్నారు. కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 14 టీఎంసీల నీటిని పంపింగ్ చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.

పెద్దపల్లిలో కోకాకోలా ప్లాంటు

- 700 కోట్లతో తయారీ పరిశ్రమ
- పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- గతేడాది కేటీఆర్‌తోనూ కంపెనీ ఒప్పందం

హైదరాబాద్, జూన్ 8(నమస్తే తెలంగాణ): హిందుస్థాన్ కోకా కోలా బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్(హెచ్‌సీసీబీ) తెలంగాణలో తమ ఉత్పత్తి సామర్థ్యం విస్తరణలో భాగంగా రూ.700కోట్ల పెట్టుబడితో పెద్దపల్లి జిల్లాలో కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు శనివారం ఎక్స్ వేదికగా ప్రకటించారు. మంత్రి కోమటిరెడ్డి, రాష్ట్ర అధికారులతో కలిసి అట్లాంటాలో హెచ్‌సీసీబీ ఫిస్కల్ పాలసీ హెడ్ జోనాథన్ రీఫ్‌తో సమావేశమైన సందర్భంగా వారు కొత్త ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారని ఆయన తెలిపారు. ప్లాంట్ ఏర్పాటుకు వారు స్థలాన్ని కూడా ఎంపిక చేసుకున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో ఐటీ రంగ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని కోకాకోలా టెక్నాలజీ గ్లోబల్ కెపాసిటీ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని తాము ప్రతిపాదించినట్టు మంత్రి తెలిపారు. నిరుడు ఆగస్టులో అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అమెరికా పర్యటన సందర్భంగా కోకాకోలా వైస్ ప్రెసిడెంట్ జేమ్స్ మెక్ గ్రీవీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు 1000 కోట్లతో సిద్దిపేటలో ఒక ప్లాంటు, అలాగే మరో 647 కోట్లతో కరీంనగర్/వరంగల్‌లో మరో ప్లాంటు ఏర్పాటుకు ఎంవోయూ చేసుకున్నారు. అమీన్‌పూర్‌లోని కోకాకోలా ప్లాంటును 2022లోనే 142 కోట్లతో విస్తరించారు. గత ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందంలో భాగంగానే తాజాగా కోకాకోలా 700 కోట్ల పెట్టుబడితో పెద్దపల్లిలో ప్లాంటు ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం.

ఆరోగ్యశ్రీలో అదనంగా 65 కొత్త చికిత్సలు

158.20 కోట్ల అంచనా • పాత చికిత్సల కోసం 497 కోట్లు విడుదల

హైదరాబాద్, జూన్8 (నమస్తే తెలంగాణ): ఆరోగ్యశ్రీ పథకం కింద యాంజియోగ్రామ్, పార్కిన్‌సన్, వెన్నముక సంబంధిత ఖరీదైన వ్యాధులతో కలిపి అదనంగా 65 కొత్త చికిత్సలను చేర్చారు. దీంతోపాటు ఆరోగ్యశ్రీ చికిత్సల ప్యాకేజీ ధరలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అందుకు రూ.497.29 కోట్లు అవసరం కాగా, డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ఈ నిధులను విడుదల చేస్తూ శనివారం ఆదేశాలు జారీ చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద కొత్త చికిత్సా విధానాలు, చార్జీల సవరణకు ఆర్థిక మంత్రి భట్టి ఆధ్వర్యంలో జూన్ 7న సచివాలయంలో సమావేశం జరిగింది. అదేవిధంగా యాంజియోగ్రామ్, పార్కిన్‌సన్, వెన్నుపూసకు సంబంధించిన 65 అధునాతన చికిత్స విధానాలను ఆరోగ్యశ్రీలో అమలు చేయాలని ప్రతిపాదించారు. అందుకు రూ.158.20 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు.

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

భార్యపై కోపంతో ఇంటికి నిప్పు

- ఆమెపైనా కిరోసిన్ పోసిన ప్రబుద్ధుడు

సిరిసిల్ల రూరల్, జూన్ 8: భార్యపై కోపంతో ఆమెతోపాటు ఇంటిపై కిరోసిన్ పోశాడో ప్రబుద్ధుడు. ఆ వెంటనే ఇంటికి నిప్పంటించడంతో ఆమె తృటిలో తప్పించుకొన్నది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లో కలకలం రేపింది. గ్రామానికి చెందిన బాలపోశయ్య, రాజేశ్వరి దంపతులు. శనివారం ఇంట్లో ఇద్దరూ గొడవపడ్డారు. క్షణికావేశానికిలోనైన బాలపోశయ్య తన భార్యపై కిరోసిన్ పోయడంతోపాటు ఇంటిపైనా చల్లాడు. బయటకు వచ్చి ఇంటికి నిప్పంటించాడు. ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రాజేశ్వరి తప్పించుకొని బయటికి రావడంతో ప్రాణాలతో బయటపడింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశా

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	40.5°c	28.2°c
మెదక్	39.3°c	22.9°c
నిజామాబాద్	39.1°c	26.1°c
మహబూబ్‌నగర్	38.7°c	28.5°c
రంగారెడ్డి	38.5°c	21.5°c
నల్లగొండ	36.5°c	24.4°c
కరీంనగర్	36.0°c	27.0°c
ఖమ్మం	34.0°c	26.0°c
వరంగల్	34.0°c	26.0°c
హైదరాబాద్	33.0°c	23.9°c

ఆఫ్లాటాక్సిన్లతో పల్లీలు విషపూరితం

వేరుశనగ సాగు దశలోనే నియంత్రించేలా దృష్టి: ఇక్రిసాట్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 8 (నమస్తే తెలంగాణ): ఆఫ్లాటాక్సిన్లతో పల్లీలు విషపూరితం అవుతున్నాయని ఇక్రిసాట్ పరిశోధకులు చెప్పారు. ఈ ఆఫ్లాటాక్సిన్ల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, ముఖ్యం గా చిన్నారుల్లో లివర్ క్యాన్సర్‌కు అ